సాక్షి ప్రకాశం

సోమవారం । 1 । ఏప్రిల్ । 2024



క్రీస్తు పునరుత్థానం

ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒంగోలులోని కొండపై జేఎంబీ చర్చి ప్రార్థనా స్థలంలో పాస్టర్ అగస్టీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



గరిష్టం/కనిష్టం

36.2/25.7

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికం.

రంజాన్ వేళలు

సోమవారం - ఇఫ్తార్ : సా॥ 6.28

మంగళవారం - సహరీ : ఉ॥ 4.43



న్యూస్‌రీల్

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు


కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నేడు సోమవారం నుంచి రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం 2 పండ్ల సైజు విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రారంభమవుతాయి. మంగళవారం 6 పళ్ల సైజు విభాగంలో ఎడ్ల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. ఆయా విభాగాల పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు ఇవ్వనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, పోటీల నిర్వాహకులు అన్నారు. వివరాలకు 81799 21128, 95811 37317, 99120 32442 నంబర్లను సంప్రదించాలని చైర్మన్ తిరుపతిరెడ్డి కోరారు.

జనావాసాలకు చేరిన చుక్కల దుప్పి



త్రిపురాంతకం: త్రిపురాంతకం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన చుక్కల దుప్పి జనావాసాలకు చేరింది. తాగునీటికి వచ్చి ఉండవచ్చని అధికారులు అంటున్నారు. అంబేద్కర్ కాలనీ ప్రాంతంలో కుక్కలు వెంట పడటంతో డేవిడ్ ఇంటి సమీపంలో ఉన్న గుంతలో పడింది. సమాచారం అందుకున్న యర్రగొండపాలెం ఫారెస్ట్ అధికారులు నీలకంఠరెడ్డి, రెస్క్యూవర్ మల్లికార్జున్ సంఘటనా స్థలంలోని దుప్పిని రక్షించి సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

అబద్ధాల గారడీ



టీడీపీ అధినేత చంద్రబాబు అట్టహాసంగా చేపట్టిన ప్రజాగళం యాత్ర ప్రజలు లేక వెలవెలబోయింది. గంట ఆలస్యంగా వచ్చినా జనం లేక ఏకంగా రోడ్‌షోనే రద్దు చేసుకుని మొక్కుబడిగా సభపెట్టి మమ అనిపించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ మార్కాపురం వైపు కన్నెత్తి చూడని.. అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విదల్చని బాబు తాను మళ్లీ అధికారంలోకి వస్తే మార్కాపురంలో నీటి సమస్య తీరుస్తానని చెప్పడంపై జనం మండిపడుతున్నారు. రామాయపట్నం పోర్టు, ప్రత్యేక హోదాపైనా అడ్డగోలుగా అబద్ధాలు మాట్లాడటంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

- అధికారంలోకొస్తే నీళ్లిస్తానంటూ వెలిగొండపై గారడీ మాటలు
- మార్కాపురంపై బాబు కపట ప్రేమ
- మూడు నెలల ముందు మాగుంటపై నిప్పులు.. నేడు ప్రశంసలు
- రామాయపట్నం, ప్రత్యేక హోదాపై దొంగాట
- కందుల ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్
- జనం లేక చంద్రబాబు ప్రజాగళం అట్టర్ ఫ్లాప్

మార్కాపురం, మార్కాపురం టౌన్: మార్కాపురంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదివారం నిర్వహించిన ప్రజాగళం యాత్ర అబద్ధాల మాటల గారడీతో జనం లేక అట్టర్ ఫ్లాప్ అయింది. 2014 నుంచి 2019 వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు పశ్చిమ ప్రకాశంపై నిర్లక్ష్యపు చూపు చూశాడు. అప్పట్లో ఉమ్మడి జిల్లాకు 8 సార్లు వచ్చినా మార్కాపురం ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదు. వచ్చిన ప్రతిసారీ వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసే గడువు దసరాకి.. సంక్రాంతికి..ఉగాదికి అదిగో.. ఇదిగో.. అంటూ ఐదేళ్ల కాలం గడిపాడు. మళ్లీ ఆదివారం నాటి ప్రజాగళం సభలో వెలిగొండ ప్రాజెక్టు పునాది వేసింది తానేననీ, నీళ్లిచ్చేది తానేనంటూ ప్రకటించడంపై ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. ఈ ప్రాజెక్టును గత నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిచేసి జాతికి అంకితం చేశారు. ఆ విషయం కూడా ఆయనకు తెలియక తాను అధికారంలోకి రాగానే నదులను అనుసంధానం చేసి నీళ్లిస్తానని చెప్పడంపై ప్రజలు అబద్ధాల బాబు మాటలపై మండిపడుతున్నారు. రామాయపట్నం పోర్టుపై కూడా మాట్లాడిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే పూర్తిచేస్తానని చెప్పడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం చివర్లో రామాయపట్నం పోర్టును మినీ పోర్టుగా మార్చి హడావుడిగా టెంకాయ కొట్టి వదిలేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే రామాయపట్నం పోర్టు పనులు శరవేగంగా చేపట్టడమేకాక..దాదాపు నిర్మాణం పూర్తి చేస్తున్నారు.

జిల్లాపై మాయమాటలు

అధికారంలో ఉన్న ఐదేళ్లు పశ్చిమ ప్రకాశంపై కపట ప్రేమ చూపిన చంద్రబాబు సీట్లు, ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు మార్కాపురాన్ని జిల్లా చేస్తానని ప్రకటించాడు. పశ్చిమ ప్రకాశం వైఎస్సార్ సీపీకి పట్టున్న ప్రాంతమని అధికారంలో ఉన్న ఐదేళ్లు ఒక్కరూపాయి ఇవ్వకుండా ప్రతిపక్ష నేత హోదాలో మాత్రం ఇప్పటికి రెండు సార్లు మార్కాపురానికి వచ్చి చూపుతున్న కపట ప్రేమను కూడా ప్రజలు గమనిస్తున్నారు. ఐదేళ్లపాటు అప్పటి బీజేపీ ప్రభుత్వంతో పొత్తుపెట్టుకుని ప్రత్యేక హోదా మాట మరిచి మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం పట్ల ప్రజలు ముక్కున వేలేస్తున్నారు. ఐదేళ్లు అధికారంలో ఉండీ మార్కాపురం మున్సిపాలిటీకి తాగునీటి కోసం ఒక్కరూపాయి కూడా విడుదల చేయకుండా కాలం గడిపిన చంద్రబాబు సభలో తనను అధికారంలోనికి తీసుకొస్తే ఎస్ఎస్ ట్యాంకు కడతానని ప్రకటించడాన్ని ప్రజలు నమ్మలేదు. గతేడాది మార్కాపురం మున్సిపాలిటీలో పైపులైన్ల మరమ్మతులు, కొత్తపైపులైన్ల ఏర్పాట్లు, తాగునీటి ఎద్దడికి రూ.24 కోట్లను సీఎం జగన్ విడుదల చేశారు.

కందుల ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్

టీడీపీ మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తన ప్రసంగంలో మాట్లాడిన మాటలు ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగ్‌గా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఎన్నికలే నాకు చివరి అవకాశం.. పొరపాటు జరిగితే నా శవాన్ని చూడాల్సి వస్తుందన్న కందుల మాటలు ఎమోషనల్ బ్లాక్‌మెయిలింగేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓటమి భయంతోనే ఇలా మాట్లాడారన్న అభిప్రాయం వ్యక్తమైంది. వీటిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

అంతలోనే ఇంతటి కపట ప్రేమా ?

సరిగ్గా మూడు నెలల క్రితం లిక్కర్ స్కామ్‌లో ఉన్న ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి తనయుడు మాగుంట రాఘవరెడ్డిని టీడీపీ నేతలు తీవ్రంగా విమర్శించారు. తాజాగా మార్కాపురం సభలో చంద్రబాబు సేవా భావం కలిగిన పెద్దమనిషి మాగుంట అని సంబోధించటం పట్ల ప్రజలు నవ్వుకున్నారు. మూడు నెలల క్రితం అదే నోటితో విమర్శించి మళ్లీ పొగిడిన చంద్రబాబు అబద్ధాలు అనర్గళంగా మాట్లాడగలడని మరోసారి రుజువైందని ఆ పార్టీ కార్యకర్తలే బహిరంగంగా అన్నారు.

చంద్రబాబు పర్యటనలో ప్రయాణికుల కష్టాలు

పొదిలి రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మార్కాపురం పర్యటన సందర్భంగా గంటపాటు తర్లుపాడు రోడ్డులో అల్లూరి పోలేరమ్మ గుడి వద్ద బస్సులు, ఆటోలు, కార్లు, బైకులు ఆపటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనుల మీద మార్కాపురానికి వచ్చేవారు మార్గమధ్యంలోనే తమ వాహనాల్లో సుమారు గంట పాటు కూర్చోవాల్సి వచ్చింది. ఇదేం ఖర్మరా బాబూ అంటూ అవస్థలు పడ్డారు. పాత బస్టాండులో మూడున్నర గంటలకు బహిరంగ సభ అని ప్రకటించినప్పటికీ జనాలు లేకపోవంతో చంద్రబాబు హెలీప్యాడ్ వద్ద ఉన్న బస్సులోనే అరగంట సేపు కూర్చున్నారు. దీంతో ఆయన కాన్వాయ్ బయలుదేరేంత వరకూ పోలీసులు తర్లుపాడు రోడ్డులో రాకపోకలు నిలిపేశారు. అసలే ఎండాకాలం, ఆపై బస్సుల్లో కార్లలో ఉన్నవారు ఉక్కపోతకు అల్లాడారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు అవస్థలు పడ్డారు.

పోలీసుల అత్యుత్సాహం

తర్లుపాడు: చంద్రబాబు ప్రజాగళం యాత్రలో కొందరు పోలీసులు అత్యుత్సాహం చూపారు. బాబుపై ఉన్న మమకారాన్ని, ప్రేమను పోగొట్టుకోలేక పట్టణంలోని వివిధ షాపులను బలవంతంగా మూసివేయించారు. దీంతో అత్యంత పవిత్రంగా జరుపుకునే ఈస్టర్ పర్వదినం రోజున క్రైస్తవ సోదరులు ఇబ్బందులు పడ్డారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలికి రెండు కిలోమీటర్ల మేర చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులపై పోలీసుల కాఠిన్యం చూపారు. చివరకు జనాలు లేక చంద్రబాబు రోడ్‌షో రద్దు చేసుకోవడంతో ఇంతదానికి తమను ఇబ్బందులు పెట్టడం ఎందుకని పలువురు చిరు వ్యాపారులు, దుకాణదారులు పెదవి విరిచారు.



జనం లేక వెలవెలబోతున్న చంద్రబాబు సభ



రీడింగ్‌రూము వద్ద మూసివేయించిన షాపులు



బారికేడ్లు పెట్టడంతో నిలిచిన వాహనాలు



పాతబస్టాండులో మూసివేసిన దుకాణాలు

ఆర్యవైశ్యుల కోసం నా ప్రాణాలను అడ్డుపెడతా

- వైఎస్సార్ సీపీలో చేరిన వారిని బెదిరిస్తే సహించేది లేదు
- నేను కన్నెర్ర చేస్తే జనార్దన్ తాత అడ్డొచ్చినా ఎవరేం చేయలేరు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన ఆర్యవైశ్య నాయకులు

ఒంగోలు టౌన్: ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆర్యవైశ్య సోదరులపై బెదిరింపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని, నేను కన్నెర్ర చేస్తే జనార్దన్ తాత అడ్డొచ్చినా ఏమీ చేయలేరని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మా పార్టీలో చేరిన వారిని బెదిరిస్తే మీ సంగతి చూస్తా... ఆర్యవైశ్య సోదరుల కోసం నా ప్రాణాలను అడ్డంపెడతా అని స్పష్టం చేశారు. ఒకవేళ టీడీపీ అధికారంలోకి వస్తే జనార్దన్ ఇబ్బందులు పెడతాడన్న భయంతోనే తాము ఆ పార్టీలో చేరినట్లు ఇటీవల టీడీపీలో చేరిన కొందరు ఆర్యవైశ్యులు చెప్పడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆర్యవైశ్య భవనంలో ఆదివారం 45, 49 డివిజన్ల ఆర్యవైశ్య సోదరులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ రోజు ఆత్మీయ సమావేశం నిర్వహించకుండా సోషల్ మీడియాలో మెసేజ్‌లు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను 5 సార్లు గెలిచినా ఆర్యవైశ్య సోదరులను ఏనాడూ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు. ఆర్యవైశ్యులు ప్రశాంతంగా వ్యాపారాలు చేసుకునేందుకు సహాయం చేశానే కానీ ఎలాంటి అపకారం చేయలేదన్నారు. కరోనా సమయంలో ఈ జనార్దన్ ఎక్కడ దాక్కున్నాడో చెప్పాలని, కనీసం ఒక్కసారైనా ప్రజల ముఖం చూశావా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఒక్క మంచి పనైనా చేశావా జనార్దన్ అని నిలదీశారు. రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, మరింత మేలు చేస్తానని హామీ ఇచ్చారు.

ఆర్యవైశ్యులు మంచి చేస్తే మరిచిపోరు...

ఆర్యవైశ్యులు మంచి చేస్తే మరిచిపోరని, ఆరామక్షేత్రం, గోశాల, బాపూజీ కాంప్లెక్స్ రెగ్యులరైజేషన్, ఆర్య భవనం పన్ను విషయాల్లో ఆర్యవైశ్యులకు ఎన్నోరకాలుగా మేలు చేసిన బాలినేని రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ అన్నారు. ఎవరినీ నొప్పించే నాయకుడు కాదు, అపకారం చేసేవారు కాదు.. బాలినేని వాసన్నకు ఓటేసి గెలిపించుకుందామని ఆర్యవైశ్య నాయకుడు కోటా సత్యం పిలుపునిచ్చారు. బాలాజీ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదంలో నష్టపోయిన వ్యాపారికి రూ.10 లక్షలు ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తడపర్తి వాసు మాట్లాడుతూ అడిగిన వెంటనే నగరం నడిబొడ్డున ఆరామక్షేత్రానికి స్థలం ఇచ్చారు, ఇంతకంటే మనకు మేలు చేసే నాయకుడెవరూ లేరన్నారు. ఆర్య వైశ్య ఆత్మీయ సమావేశం నిర్వహించకుండా చేసేందుకు మెసేజ్‌లు పెట్టి సమావేశం జరగకుండా చేయాలనే కుట్రలు చేయడం సిగ్గుచేటని సమావేశ నిర్వాహకులు పీ శ్రీనివాసరావు ఖండించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్, సీనియర్ నాయకులు గోలి తిరుపతిరావు, ఘంటా రామానాయుడు, మునగా కృష్ణారావు, గ్రంధి కాశీ విశ్వనాథ్, ఆర్ఎస్ శ్రీనివాసరావు, కే సత్యనారాయణ, కే సుబ్బారావు, బీ స్వామి, బదరినాథ్, రాజా పాల్గొన్నారు.

‘మేమంతా సిద్ధం’ బస్సు యాత్ర స్థల పరిశీలన

- స్థలాన్ని పరిశీలించిన చెవిరెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం



స్థలపరిశీలన చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తలశిల రఘురాం, అన్నా రాంబాబు

పొదిలి రూరల్/కొనకనమిట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈనెల 7వ తేదీ ప్రకాశం జిల్లా పొదిలిలో జరగనుంది. మేమంతా సిద్ధం సభా ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని పొదిలి మండలంలోని దొనకొండ అడ్డరోడ్డు వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మార్కాపురం అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పరిశీలించారు. వీరివెంట పొదిలి, కొనకనమిట్ల నాయకులు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మండల పార్టీ సమన్వయకర్త ఉడుముల గురవారెడ్డి, పార్టీ నాయకులు మందలపు శ్రీనివాసులురెడ్డి, శిరుగూరి కోటేశ్వరరావు, అంజిరెడ్డి, కోనేటిరెడ్డి, సంజీవరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి ఉన్నారు.

అభివృద్ధి చేస్తా..ఆశీర్వదించండి

- మంత్రి, సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యర్థి మేరుగు నాగార్జున



చీమకుర్తిలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓటు వేసి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. చీమకుర్తి పట్టణంలోని 17, 18, 19 వార్డుల్లో ఆదివారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను గుర్తు పెట్టుకొని వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలన్నారు. తనను గెలిపించనట్లయితే సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు ఆముదాలపల్లి ప్రమీల రామబ్రహ్మం, షేక్ ఖాజా, గంగిరెడ్డి ఇందిర సుందరరామిరెడ్డి, పాలడుగు సుబ్బారావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి

మద్దిపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మండల కేంద్రం మద్దిపాడు, మెయిన్ సెంటర్, పెరిక పాలెం సాయి నగర్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. నిజం చెబితే చంద్రబాబు తల పగిలిపోతుందని శాపం ఉందని అందుకే అబద్ధాలు ఆడి బతికేస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబుకు వయసు అయిపోవడంతో సంధి ప్రేలాపనలు పేలుతున్నాడని, అతనికి నిమ్నవర్గాలంటే విపరీతమైన ద్వేషం ఉందని పలు సందర్భాల్లో మాట్లాడిన మాటల ద్వారా తేటతెల్లమవుతోందన్నారు. నావలన మీ ఇంటిలో మేలు జరిగితేనే నాకు ఓటు వేయండని అడిగిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను సంతనూతలపాడు ప్రజలు దీవించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముందుగా ఆయన మద్దిపాడు చేరుకోగానే స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, మరో కార్యదర్శి మోరబోయిన సంజీవరావు, మద్దా లక్ష్మీనారాయణ, సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ పలువురు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ లౌకికవాద పార్టీ

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): వైఎస్సార్‌సీపీ లౌకిక వాద పార్టీ అని అన్ని మతాల శ్రేయస్సే లక్ష్యంగా కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, పార్టీ కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ముస్లింలతో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మంత్రి సురేష్, ఆయన కుమారుడు విశాల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ ముస్లింల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ఎంతో కృషి చేస్తోందన్నారు. షాదీఖానా కోసం నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. ముస్లింల శ్మశాన వాటికను నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ముస్లింలు పార్టీకి అండగా ఉంటారని, వారి ఆప్యాయతను పార్టీ విస్మరించదన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు మత తత్వ పార్టీ అయిన బీజేపీతో కలిశారని విమర్శించారు. నిన్నటి వరకు ఒకరినొకరు విమర్శించుకున్న వీరు ఇప్పుడు ఎన్నికల కోసం కలిశారని, వీరిది అపవిత్ర పొత్తు అని ఎద్దేవా చేశారు. ముస్లింలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తరువాత ముస్లింలకు పండ్లు తినిపించి రంజాన్ దీక్ష విరమింపజేశారు. స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్ బాషా, షేక్ ఇస్మాయిల్, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, షేక్ నౌషాద్, షేక్ కరీం, షేక్ అబ్దుల్లా, సయ్యద్ ఆబిద్‌ఆలీ, షేక్ సుల్తాన్, షేక్ జిలానీ, షేక్ జానీబా,షా, పఠాన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

క్లుప్తంగా

30 మద్యం సీసాలు స్వాధీనం

చీమకుర్తి: మండలంలోని నాయుడుపాలెంలో ఒక వ్యక్తి అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తుండగా, సెబ్ సీఐ మారయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 30 సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

పేకాట శిబిరంపై దాడి.. రూ.67,680 స్వాధీనం

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం మంగమూరులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ మారయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.67,680 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించినట్లు వెల్లడించారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

మార్కాపురంరూరల్: మండలంలోని వేములకోట గ్రామంలో గత నెల 23న టీడీపీ నాయకులు నిర్వహించిన ప్రచార సభలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు కోర్టు ఆదేశాలతో 12 మంది టీడీపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు. వేములకోటలో టీడీపీ నేతలు సమావేశం ఏర్పాటు చేసిన భోజనాలు పెట్టారు. సభలో పలువురు ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు గుర్తించిన ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు కోర్టు పరిశీలనకు పంపారు. కోర్టు ఆదేశాలతో ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మాగుంట రాఘవరెడ్డి, కందుల నారాయణరెడ్డి, ఇమ్మడి కాశీనాథ్, కందుల రామిరెడ్డి, బొందిలి కాశీరాం, తాళ్లపల్లి సత్యనారాయణ, చాగంటి సుబ్బారెడ్డి, కర్ర నర్సిరెడ్డి, జంకె రమణారెడ్డి, రాచకొండ సుబ్బరాయుడు, గోగు వెంకటేశ్వర్లు తదితరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టీడీపీ నేతల ఎన్నికల కోడ్ ఉల్లంఘన



సంసిద్ధం స్టిక్కర్‌తో టీడీపీ నేతల వాహనం

మార్కాపురంరూరల్: టీడీపీ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూనే ఉన్నారు. గిద్దలూరు టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి అనుచరులు తమ వాహనాలపై సంసిద్ధం అనే స్టిక్కర్ వేసుకుని ఆదివారం మార్కాపురం పట్టణానికి వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వాహనం వెంట వచ్చారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించి చంద్రబాబు ఫొటో ఉన్న స్టిక్కర్‌ను కారుకు అంటించి పట్టణంలో తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో బహిరంగంగా టీడీపీ నేతలు కోడ్ ఉల్లంఘించారు.

మేము చేసేదే చెబుతాం

- చంద్రబాబులా ఉత్తుత్తి హామీలిచ్చే ప్రభుత్వం మాది కాదు
- ఆ నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది
- వలంటీర్ల వ్యవస్థపై ఆంక్షల గురించి ఎన్నికల కమిషన్ పునరాలోచించాలి
- నిస్సహాయ స్థితిలో ఉన్న పింఛన్‌దారులకు ఇది కఠిన పరీక్షగా మారుతోంది
- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- పెళ్లూరులో ఎన్నికల ప్రచారానికి బ్రహ్మరథం



ప్రజలకు అభివాదం చేస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసేదే చెబుతామని, చెప్పినవన్నీ చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆ నమ్మకం ప్రజల్లో బలంగా ఉందన్నారు. అంతేగానీ, చంద్రబాబులా ఉత్తుత్తి హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేసే ప్రభుత్వం తమది కాదన్నారు. ఒంగోలు 17వ డివిజన్‌లోని పెళ్లూరులో ఆదివారం బాలినేని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు బ్రహ్మరథం పట్టి అడుగడుగునా ఆదరాభిమానాలతో స్వాగతించారు. అనేకమందిని పేరుపేరునా తల్లీ బాగున్నారా.. పెద్దయ్య ఎలాగున్నావ్ అంటూ పలకరిస్తూ బాలినేని ముందుకు సాగారు. దీంతో వారిలో ఆనందం రెట్టింపయింది. బైపాస్ వద్ద నుంచి ప్రచారం ప్రారంభించి పెళ్లూరులో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా ఇళ్లపట్టాలు రాకపోతే వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, రెండో జాబితాలో తప్పకుండా అందించే బాధ్యత తాను తీసుకుంటానంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు పెన్షన్లు రేపు ఇస్తారా..లేదా..? వలంటీర్లు రారంట కదా అంటూ అడగడంతో బాలినేని ఆవేదనకు గురయ్యారు. కొంతమంది కుట్రదారులు చేసిన పని వల్ల ఇబ్బంది తలెత్తిందని, అయినా ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతుందని చెప్పారు. కేవలం రెండు నెలలు ఓపిక పడితే మళ్లీ మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పెన్షన్ ఇస్తారని భరోసా ఇచ్చారు. తాము కూడా ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేస్తున్నామని వివరించారు. అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉండే వృద్ధులు, దివ్యాంగులు, మానసిక సమస్యలతో బాధపడేవారు, మంచంలో ఉండి కదలలేని వారు, ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న ఎంతోమందికి వలంటీర్ల ద్వారా సామాజిక పెన్షన్ అందించడం ఒక గొప్పవరంగా ఉందన్నారు. కానీ, నేడు టీడీపీ దుర్మార్గపు కుట్రల కారణంగా వలంటీర్లపై ఆంక్షలతో పింఛన్ లబ్ధిదారుల మొహంలో ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. టీడీపీ గెలిస్తే వలంటీర్లను కొనసాగిస్తామంటూనే మరో వైపు వలంటీర్లను టెర్రరిస్టులు, జిహాదీలు, గోనెసంచులు మోసేవారు అంటూ దుర్మార్గంగా మాట్లాడుతూ చివరకు వారి నిస్వార్థ సేవలకు కూడా పచ్చ పైత్యం పులిమి నిస్సహాయులపై పగబట్టడాన్ని ప్రతిఒక్కరూ గమనించాలని బాలినేని కోరారు. ఇది ఏ ఒక్క పార్టీకో చెందినది కాదని, మానవత్వానికి సంబంధించిన అంశంగా మానవతావాదులు, ప్రజాసంఘాలు గమనించాలని అన్నారు. వలంటీర్ వ్యవస్థ ప్రారంభం నుంచి టీడీపీ అడుగడుగునా విమర్శలు గుప్పిస్తూనే ఉందన్నారు. అటువంటి పార్టీ నాయకులు చేయించే కుట్రలకు అమాయకులు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుండటం బాధాకరమన్నారు. ఎన్నికల కమిషన్ కూడా ఈ వ్యవహారంపై పునరాలోచించాలని కోరుతున్నామన్నారు.

ఉగాది రోజు వైఎస్సార్ సీపీ మ్యానిఫెస్టో...

తన ప్రచారానికి లభిస్తున్న ఆదరణ అద్వితీయంగా ఉందని బాలినేని అన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ గెలవాలని, జగన్ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు తాము అందుకోగలమనే భావన ప్రజల్లో నెలకొందన్నారు. ఏప్రిల్ 9న ఉగాది పండుగరోజు సీఎం జగన్ వైఎస్సార్ సీపీ మ్యానిఫెస్టో విడుదల చేస్తారన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన మ్యానిఫెస్టోలో 95 శాతానికిపైగా హామీలను తమ ప్రభుత్వం నెరవేర్చిందని వివరించారు. కానీ, 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600కుపైగా హామీలిచ్చి వాటిలో రెండు మూడు కూడా అమలుచేయలేదన్నారు. చంద్రబాబు నైజాన్ని నమ్మేందుకు జనం సిద్ధంగా లేరన్నారు.

కార్యక్రమంలో బాలినేని వెంట 17వ డివిజన్ కార్పొరేటర్ నాగం వెంకట శేషయ్య, డివిజన్ అధ్యక్షుడు నాగం వెంకట్రావు, స్థానిక నాయకులు పసుపులేటి వాసు, రావూరి ఆంజనేయులు, ఎస్.కృష్ణ, పి.నారాయణ, మోహన్, వేణు, జి.వెంకట్రావు, ప్రసాదు, రాఘవయ్య, శ్రీను, కిషోర్, బ్రహ్మయ్య, జగన్ యాదవ్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కటారి ప్రసాద్, మేదర కార్పొరేషన్ చైర్మన్ కేతా లలిత నాంచారమ్మ, మహిళా విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నక్కల లీలాకుమారి, నరాల రమణారెడ్డి, భట్రాజు, సూర్య, కృష్ణ బలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు రాజు, దాసరి కరుణాకర్, తిర్లిక శ్రీనివాసులు, ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, ఎందేటి రంగారావు, మాజీ జెడ్పీటీసీ మట్టి రాఘవ, జిల్లా ఉపాధ్యక్షుడు బాలిశెట్టి నాగేశ్వరరావు, గొర్రెపాటి శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మాజీ ఎంఎల్‌ఏ కసుకుర్తి ఆదెన్న, పల్లా అనూరాధ, మేరీ కుమారి, శివకుమార్, గుర్రం వెంకయ్య, బొమ్మినేని మురళి, గంటా రామానాయుడు, రావూరి ఆంజనేయులు, భీమేష్, పులుగు అక్కిరెడ్డి, మహిళా విభాగం నగర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో టీడీపీకి షాక్

- ఎమ్మెల్యే బాలినేని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు



వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు: కొత్తపట్నం మండలం మడనూరు పంచాయతీ స్వర్ణాంధ్ర పట్టపుపాలేనికి చెందిన సాయినాథ్, జాలయ్య, నాగరాజు, రాజుతో పాటు 20 మంది టీడీపీ నాయకులు వాయల రోశయ్య, ప్రళయకావేరి కొండయ్య ఆధ్వర్యంలో ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి బాలినేని ఆహ్వానించారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలినేని మాట్లాడుతూ స్వర్ణాంధ్ర పట్టపుపాలెం నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన ప్రతి ఒక్కరినీ ప్రత్యేకంగా అభినందించారు. ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్నప్పటికీ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా మత్స్యకారులకు ఇచ్చిన పథకాలు నచ్చి వైఎస్సార్ సీపీలో చేరడం తమకు మడనూరులో మరింత బలాన్ని చేకూర్చిందన్నారు. గతంలో గ్రామంలో వెయ్యి ఓట్ల మెజార్టీ వస్తే.. ఈ దఫా 1500 ఓట్ల మెజార్టీ మడనూరులో వస్తుందని భావిస్తున్నామన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన సాయినాథ్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా టీడీపీలో ఉన్నామని, కానీ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, వాసన్న చేస్తున్న అభివృద్ధి నచ్చి వైఎస్సార్ సీపీలో చేరామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ వాయల మోహన్‌రావు, రాష్ట్ర మత్స్యకార డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, సామంతుల వీరారెడ్డి, పొక్కింగారి యానాది, మాజీ ఎంపీపీ బలగాని శ్రీనివాసరావు, రవికుమార్, ప్రసాద్, శ్రీను, నాగూర్, రాజిబాబు, మార్క్, బాబు, వెంకటేశ్వర్లు, శ్రీహరి, తామ్‌రాజు, అంకయ్య, బాబూరావు, రవి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు



టీడీపీ ప్రచారంలో గుర్రం చంద్రపాల్

గిద్దలూరు రూరల్: మండలంలోని పొదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తూ గుర్రం చంద్రపాల్, గ్రామ సచివాలయంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కొమ్మునూరి మధుబాబులు టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డితో పాటు మరి కొందరు టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా ఎన్నికల అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. అదే విధంగా ఆర్టీసీ ఉద్యోగి మోహన్‌రెడ్డి సైతం టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి సేవలో తరిస్తున్నాడు. రాచర్ల మండలం ఓబుల్‌రెడ్డిపల్లెకు చెందిన మోహన్‌రెడ్డి అశోక్‌రెడ్డి ఇంటికి వెళ్లి పూలమాలలు వేసి మా మద్దతు మీకే అంటూ బహిరంగంగా ప్రకటించాడు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఈ విధంగా ప్రచారం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



అశోక్‌రెడ్డితో ఆర్టీసీ ఉద్యోగి మోహన్‌రెడ్డి

జనం మెచ్చిన నేత.. జగన్

- చదలవాడ పరిచయ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున



చదలవాడలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: సమాజంలోని అన్ని వర్గాల ఆదరాభిమానాలు పొంది ప్రజారంజక పాలన అందించి జనం మెచ్చిన నేతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని, అలాంటి నాయకుడిని ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఆదివారం మండలంలోని చదలవాడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మేరుగు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనకు అప్పగించిన పనిని శ్రద్ధతో చేయడమే నేర్చుకున్నానని, అలాంటి నాయకుడి ఆధ్వర్యంలో మనందరం పని చేయడం చాలా సంతోషకరమని అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా మళ్లీ ఎగిరి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలని ప్రతి కార్యకర్త కోరుకుంటున్నారని, దీనికి అనుగుణంగానే అందరం కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. ముందుగా గ్రామంలోని చదలవాడ రఘునాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతనం చర్చిలో ప్రార్థనలు చేశారు. మంత్రి మేరుగు నాగార్జునకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, శాలివాహన, కార్పొరేషన్ల స్టేట్ డైరెక్టర్ పేరాల చెన్నకేశవులు, పోలినేని కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దాసరి వరప్రసాదరావు, తోకల శ్రీను, కోడె సుబ్బారావు, ఉప్పుగుండూరి శ్రీనివాసప్రసాద్, కోయి హనుమయ్య, కాట్రగడ్డ శ్రీను, కుమ్మూరి సుధాకర్, ఆనంద్, వజ్రంబాబు, కిరణ్, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఫ్లాష్ మాబ్

ఒంగోలు టౌన్: ప్రస్తుత ఎన్నికల్లో ఓటర్లంతా వారి ఓటు హక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు వినూత్నంగా చైతన్యం కలిగించారు. నగరంలోని రవిప్రియ మాల్‌లో ఆదివారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. స్వీప్ ప్రకాశం జిల్లా, ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక టీ షర్టులు ధరించిన విద్యార్థులు.. నృత్యం చేసి అలరించడమే కాకుండా ప్రజల్లో ఆలోచన రేకెత్తించారు. ప్రజలు కేరింతలతో విద్యార్థులను అభినందించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఓటర్లలో చైతన్యం కలిగించడం ద్వారా ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్వీప్ నోడల్ అధికారి డా.రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా.తిరుమలరావు, జ్యోతి, స్వీప్ అధికారి వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవం.. శ్రీవారి బ్రహ్మోత్సవం



అలంకరణలో ఉత్సవమూర్తులు



శ్రీవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు


- కన్నుల పండువగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- తిరునాళ్లతో సందడి
- గరుడ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండలో వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం తిరునాళ్ల కావడంతో భక్తులతో వెలుగొండ కిక్కిరిసింది. బ్రహ్మోత్సవ సందడి నెలకొంది. శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీవారు పల్లకిలో అలంకరించిన గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీవారిని వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాల మధ్య వెలుగొండ పురవీధుల్లో ఊరేగించారు. తిరునాళ్లలో పలు రకాల షాపుల వద్ద భక్తుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. పలువురు మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉభయదాతలుగా కూనపల్లి శేషఫణిశర్మ, ప్రసాదశర్మ, దూర్జటిశర్మ, వీరభద్రశర్మ, శ్రీకాంతశర్మ, రామచంద్రపవన్‌కుమార్, శాంతమూర్తి, జానకీరామ్ దంపతులు వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తల పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగాయి. వేదపండితులు తిరుమలాచార్యులు, భార్గవశర్మ, పవనకుమార్‌శర్మ స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. కొండపై ఉన్న అమ్మవారికి, గంగమ్మతల్లి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించి స్వామివార్లను దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు అన్ని కులాల అన్నదాన సత్రాలలో అన్నదానం చేశారు. సోమవారం మోహినీ ఉత్సవం, గజోత్సవం, తిరునాళ్ల, పగలు ఎడ్ల పందేలు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ తిరుపతిరెడ్డి తెలిపారు.


అతి వేగానికి ఒకరు బలి

- మరొకరికి తీవ్ర గాయాలు

జరుగుమల్లి: అతి వేగంతో చెట్టును ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా..మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన వావిలేటివారిపాడు వద్ద ఆదివారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళితే..కొరిశపాడు మండలం దైవాలరావూరు గ్రామానికి చెందిన అంగులకుర్తి అజయ్ జరుగుమల్లి మండలంలోని పంగులూరివారిపాలేనికి చెందిన బెజవాడ శ్రీహరి పొగాకు బ్యారన్ కాల్చుకు వచ్చారు. ఆదివారం చికెన్ కోసం పంగులూరివారిపాలెం నుంచి ద్విచక్రవాహనంపై టంగుటూరు వస్తున్నారు. వీరు జరుగుమల్లి దాటిన తరువాత వావిలేటిపాడు సమీపంలో అతి వేగంగా చెట్టును ఢీకొట్టారు. ప్రమాదంలో బండి నడుపుతున్న నవీన్‌కు తీవ్ర గాయాలు కాగా..వెనుక కూర్చున్న అంగలకుర్తి అజయ్ తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. క్షతగాత్రున్ని 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జరుగుమల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రున్ని వైద్యశాలకు తరలిస్తున్న 108 సిబ్బంది



అంగలకుర్తి అజయ్ మృతదేహం